కార్మిక వ్యతిరేక విధానాలను సహించం
● కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరు మారాలి: జేసీటీయూ
● 9న అఖిల భారత సమ్మెకు పిలుపు 6

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం

●రాయచూరు జిల్లా మొహర్రం వేళ విషాదం

రాష్ట్ర రాజకీయాల్లోకి.. ఖర్గే..!

● మారుతున్న రాజకీయాలు
● సిద్దరామయ్యకు ఏఐసీసీ పదవితో జోరందుకున్న చర్చలు
● ఖర్గేను రాష్ట్రానికి పంపడానికేనా..?
● పార్టీలో అంతర్గత పోరు.. విరామమా, అంతిమమా..?





బెంగళూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి రెండున్నరేళ్ల పాలన సమీపిస్తున్న కొద్దీ రాజకీయ సంచలన వ్యాఖ్యలు హల్‌చల్ చేస్తున్నాయి. రాజకీయం అంటే ఉన్న పదవిని కాపాడుకోవడం, సొంత పార్టీకే చెందిన ప్రత్యర్థిని ఎటువంటి అవకాశాలు లేకుండా చేయడం అనేది సహజమే. కానీ రాష్ట్ర రాజకీయాల్లో అనూహ్యమైన పరిణామాలు ఉంటాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. 2023 శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి రికార్డుస్థాయిలో 135మంది ఎమ్మెల్యేలు గెలుపొందారు. సీఎం ఎంపిక విషయంలో ఢిల్లీ కేంద్రంగా వారం రోజులపాటు కసరత్తు సాగింది. ముఖ్యమంత్రి పదవి మినహా మరెటువంటి ఆలోచన లేదని డీకే శివకుమార్ పట్టుబట్టారు. కానీ అధిష్టానం సిద్దరామయ్యవైపు మొగ్గు చూపుతూనే డీకే శివకుమార్‌కు కోరుకున్న అవకాశాన్ని కట్టబెట్టింది. అప్పటికే కొనసాగుతున్న కేపీసీసీ అధ్యక్ష పదవితోపాటు ఉపముఖ్యమంత్రి, జలవనరులు, బెంగళూరు నగరాభివృద్ధిశాఖలకు సుముఖత వ్యక్తం చేసింది. ఇలా రాష్ట్ర చరిత్రలో పార్టీతోపాటు కీలక మంత్రిశాఖలు ఒక్కరికే కాంగ్రెస్‌లో కొనసాగించింది లేదు. ఐదేళ్లు సీఎంగా సిద్దరామయ్య ఉంటారని ఎవరైనా బహిరంగంగా మాట్లాడినా వెంటనే అధిష్టానం అప్రమత్తమయ్యేది. నాయకత్వ మార్పు విషయం మీకెందుకు అంటూ మందలించేది. ఇలా రెండేళ్ల వ్యవధిలో రెండుమూడు సందర్భాల్లో హెచ్చరిస్తూ వచ్చింది. దళిత సీఎం తెరపైకి వచ్చిన సందర్భంలోనూ తీవ్రంగా వ్యాఖ్యానించింది. కానీ రెండున్నరేళ్లు సమీపిస్తున్న తరుణంలో తానే ఐదేళ్లు ముఖ్యమంత్రి అంటూ సిద్దరామయ్య స్వయంగా ప్రకటించడం కొత్త అలజడికి కారణమైంది. డీకే శివకుమార్ ఇదే విషయమై మీడియాతో మాట్లాడినవేళ అనివార్యం లేక అంగీకరిస్తున్నా అన్నారు. బహిరంగంగా ఆ వ్యాఖ్య చేసినా అంతర్గతంగా ఎటువంటి రాజకీయ సంచలనం సృష్టించేందుకైనా డీకే శివకుమార్ వెనుకడుగు వేయరనేది అందరికీ తెలిసిన విషయమే. సిద్దరామయ్య అహింద నేతగా గుర్తింపు కల్గినవారు. ప్రస్తుతం సిద్దరామయ్యకు సమఉజ్జీ నేతల్లో ఖర్గే పేరు కూడా ఉంది. ప్రస్తుతం ఆయన ఏఐసీసీ అధ్యక్షుడిగాను, రాజ్యసభలో ప్రతిపక్షనేతగా కొనసాగుతున్నారు. అయితే ,ఖర్గే నాలుగు దశాబ్దాల రాజకీయంలో ముఖ్యమంత్రి పదవి చేపట్టాలనేది ఆశగా ఉంది. ఈ అంశాన్ని గతంలో పలుమార్లు బహిరంగంగానే వ్యాఖ్యానించారు. అయితే సమీకరణలు అనుకూలించకపోవడంతో సాధ్యం కాలేదు. కానీ 2023 ఎన్నికల విజయం తర్వాత సీఎం పదవికి సిద్దరామయ్యతో డీకే శివకుమార్ పోటీ పడినప్పుడు ఓ ప్రతిపాదన చేశారు. మల్లికార్జున ఖర్గేను సీఎం చేస్తే రేసునుంచి తప్పుకుంటానని ప్రస్తావించారు. ఈ విషయం సిద్దరామయ్యకు అప్పట్లో కంటకంగా మారింది.

నేడు బెంగళూరుకు సుర్జేవాలా

ఇటీవల మంత్రి రాజణ్ణ సెప్టెంబరులో అనూహ్యమైన మార్పు ఉంటుందని వ్యాఖ్యానించారు. కొంతమంది డీకే శివకుమార్‌కు మద్దతు ఇచ్చేలా ఆ వ్యాఖ్యలు మారాయి. మల్లికార్జున ఖర్గేను జాతీయ రాజకీయాలనుంచి రాష్ట్రంవైపు తీసుకురావాలనే ప్రయత్నాలు జోరందుకున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే ఎస్సీ సామాజికవర్గానికి చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు ఢిల్లీ వెళ్లేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఇప్పటికే పార్టీలో అంతర్గత విబేధాలు పెరుగుతున్న తరుణంలో పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ రణదీప్ ఎసింగ్ సుర్జేవాలా మూడు రోజులపాటు నగరంలోనే మకాం వేసి మంత్రులు, పలువురు ఎమ్మెల్యేలతో వ్యక్తిగతంగా భేటీ అయి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. బహిరంగంగా ఎవరూ వ్యాఖ్యానించరాదని హెచ్చరించారు. మరోసారి ఆయన సోమవారం బెంగళూరుకు వస్తున్నారు. రెండు మూడు రోజులు కేపీసీసీలోనే గడపనున్నట్లు తెలుస్తోంది. సుర్జేవాలా తొలి విడత పర్యటన ముగించుకుని ఢిల్లీ వెళ్లిన తర్వాతే ఐదేళ్లు తానే సీఎం అంటూ సిద్దరామయ్య వ్యాఖ్యానించారు. బహిరంగంగా డీకే శివకుమార్ అంగీకరించినా, అంతర్గతంగా ఆయన తీవ్ర ఆలోచనలో పడినట్లు తెలుస్తోంది. మరో మూడు రోజులు సుర్జేవాలా బెంగళూరులో గడపడం ద్వారా అంతర్గత విబేధాలకు అంత్యం పలుకుతారా..? లేదా కొత్త అంశాలు వెలుగులోకి వస్తాయా..? అనేది వేచి చూడాల్సి ఉంది. దాదాపు ఏడాది కాలంగా మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణకు వాయిదాలు పడుతూ వచ్చాయి. ఇటీవల సీఎం ఢిల్లీకి వెళ్లిన సమయంలో మరో ఐదు నెలలు విస్తరణ ఉండదంటూ తేల్చారు. ఈలోగానే సిద్దరామయ్యకు ఏఐసీసీ ఓబీసీ విభాగంలో కీలకమైన అవకాశం కల్పించారు. సిద్దరామయ్యకు అధిష్టానంలోని ఓ కమిటీలో నియమించడం ద్వారా సొంత పార్టీ ఎమ్మెల్యేలు నిశ్శబ్దంగా ఉన్నా ప్రతిపక్ష బీజేపీ నేతలు మాత్రం తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. ఇక సీఎం పదవిని వీడి.. ఢిల్లీ రాజకీయాల్లో కలుద్దాం అంటూ కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి వ్యాఖ్యానించారు. ఇది ప్రమోషన్ కాదు... చెక్ పెట్టేందుకే కొత్త అవకాశం ఇచ్చారని బీజేపీ అధ్యక్షుడు విజయేంద్ర అభిప్రాయపడ్డారు. ఈనెల 15న ఏఐసీసీ ఓబీసీ సలహామండలి తొలిసభ బెంగళూరులో జరుపుతున్నారు. సిద్దరామయ్య సభ్యుడిగా మాత్రమే ఉంటారా...? లేదా ఛైర్మన్ హోదా కల్పిస్తారా...? అనేది అదేరోజు తేలనుంది. తాజా రాజకీయ మార్పులతో ఖర్గేను ఢిల్లీ నుంచి వెనక్కి తీసుకురావాలనే కసరత్తు సాగుతున్నట్లు వార్తలు జోరందుకున్నాయి.

ఎమ్మెల్యేలతో చర్చలు

బళ్లారి, జూలై 6(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో అధిష్టానం జరుపుతున్న చర్చలపై ఊహాగానాలు ఊపందుకున్నాయి. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ సుర్జేవాలా, అల్‌ఇండియా కాంగ్రెస్ కమిటీ సెక్రటరీలు ముగ్గురు ఉన్న విడివిడిగా చర్చలు జరుపుతోంది. జూలై లో తొలివిడతగా ఎమ్మెల్యేలతో చర్చలు సాగించారు. మరో రెండుమూడు రోజుల్లో ఉత్తర కర్నాటక జిల్లాల ఎమ్మెల్యేలతోనూ కాంగ్రెస్ ఉన్నత కమిటీ సమావేశం చేయనుంది.

● రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు కాలం దాటింది. దక్షిణాది రాష్ట్రాల్లో కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రంలో కర్ణాటక ఒకటి. రాష్ట్రంలో ఈరెండేళ్లలో ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు అందుతున్నాయా.? ప్రజల్లో పార్టీ పైనా ఏమైనా వ్యతిరేకత ఉందా... అనే ప్రశ్నలతో ఎమ్మెల్యేలను ఢిల్లీ కమిటీ విచారిస్తోందని తెలుస్తోంది.

● రాష్ట్రంలో రెండున్నరేళ్ల తరువాత కేబినెట్‌లో మార్పులు, చేర్పులు ఉంటాయని ఆశావహులు పేర్కొంటున్నారు. కొందరికి ఉద్వాసన, కొందరికి అవకాశం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ఇక ఎస్టీ కార్పొరేషన్‌లో జరిగిన అక్రమాల కారణంగా తొలగించిన నాగేంద్ర, సీనియర్ నాయకులు బీకే హరిప్రసాద్, మరో ఇద్దరు ముగ్గురు ఎమ్మెల్సీలు కూడా మంత్రి పదవి దక్కలేదనే బాధలో ఉన్నారు. వారికీ అవకాశం దక్కనున్నట్లు తెలుస్తోంది.

● రెండున్నరేళ్ల కాలం పూర్తి కావడానికి దగ్గర పడుతున్న నేపథ్యంలో తనకు సీఎం పదవి కావాల్సిందే అని డిప్యూటీ సీఎం డికే శివకుమార్ గట్టిగా పట్టుపట్టినట్లు కాంగ్రెస్ వర్గాలు అంటున్నాయి. ప్రస్తుత సీఎం సిద్దరామయ్యను పదవి నుంచి దించితే ఏలా.. ఏమైనా కాంగ్రెస్‌లో ఎమ్మెల్యేలు వర్గాలుగా విడిపోతారా..? లేదా పార్టీ నిర్ణయం కు కట్టుబడే ఉంటారా..? అనే అంశం ఎమ్మెల్యేల అంతర్గత అభిప్రాయం కూడా ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలు లోతుగా ఆరా తీస్తున్నారని తెలుస్తోంది.

●ఇక బెంగళూరులో క్రికెట్ సంబరాల్లో జరిగిన ప్రమాదంలో 20మందికి పైగా మృతి చెందిన సంగతి తెలిసిందే. అప్పుడు తాత్కాలిక సీఎం ఎవరా అని కాంగ్రెస్ ఢిల్లీ పెద్దలు తక్షణం రెవెన్యూశాఖ మంత్రి కృష్ణభైరేగౌడను రప్పించుకుని చర్చించారు. కృష్ణ భైరే గౌడ కూడా లింగాయత్ సమాజానికి చెందిన వారు కావడం, డీసీఎం డీకేకు ఆయనే దీటైన వ్యక్తి అని అందరి నమ్మకం.

● ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున కుమారుడికి కానీ ఖర్గేనే ముఖ్యమంత్రిగా చేయాలనే ఆలోచన కూడా ఉంది. ఇలా అనేక అంతర్గత విభేధాలు, రాజకీయ పరిణామాలు ఉన్న నేపథ్యంలో బీజేపీ కూడా వెయిట్ అండ్ సీ అనే రకంగా పాచికలు వేస్తుంది. నవంబరు, డిసెంబరు లో ముఖ్యమంత్రి మారే అవకాశం ఉంటుందని పార్టీలో చర్చసాగుతుంది. తొలి విడత చర్చలు ముగిశాయి. ఇక మలి విడత ఉత్తర కర్నాటక ఎమ్మెల్యేలతో చర్చలకు అధిష్టానం సిద్ధం అయ్యింది.



ఎస్ఐ ఆత్మహత్య



నాగరాజు (ఫైల్)

బెంగళూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): దావణగెరె పోలీస్‌స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు (58) తుమకూరులోని ఓ లాడ్జిలో ఆత్మహత్యకు పాల్పడ్డారు. దావణగెరెలో పనిచేసే ఎస్సై నాగరాజు ఈనెల 1వ తేదీన తుమకూరుకు వచ్చారు. లాడ్జిలో గదిని అద్దెకు తీసుకున్నారు. అక్కడే ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. లాడ్జిలో దుర్వాసన వస్తుండడంతో సిబ్బంది పరిశీలించగా ఎస్సై ఆత్మహత్య విషయం ఆదివారం వెలుగులోకి వచ్చింది. దావణగెరె తాలూకా జవళగట్ట గ్రామానికి చెందిన నాగరాజు దావణగెరె లే అవుట్ పోలీస్‌స్టేషన్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నారు. గదిలో డెత్‌నోట్ రాసిపెట్టినట్టు పోలీసులు గుర్తించారు. మూడు పేజీల డెత్‌నోట్‌లో నా పిల్లలను బాగా చూసుకోండంటూ రాశారు. ఆత్మహత్య సొంత నిర్ణయమని పొందుపరిచినట్లు తెలుస్తోంది. కుమార్తె, అల్లుడిని పొగుడుతూ డెత్‌నోట్‌లో రాసుకున్నారు. విషయం తెలిసిన వెంటనే నాగరాజు భార్య లలితతో పాటు కుటుంబసభ్యులు తుమకూరుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ మరో ఏడాదిపాటు సర్వీసు ఉందని బీపీ, షుగర్‌తోపాటు పలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. జూన్ 30న ఇంటినుంచి బయటకు వచ్చారని, ఆ మరుసటి రోజు ఫోన్ స్విచ్ఛాఫ్ చేశారని, దీంతో దావణగెరెలో మిస్సింగ్ కేసు నమోదు చేశామన్నారు. నాగరాజు మృతదేహాన్ని జిల్లాసుపత్రికి తరలించి తుమకూరు పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు ఈ కేసును తీవ్రంగా పరిగణిస్తున్నారు.

14న సిగందూరు వంతెన ప్రారంభం

● దేశంలో రెండో కేబుల్ బ్రిడ్జి



భారీ వాహనాలతో కేబుల్ వంతెనను పరిశీలిస్తున్న దృశ్యం



బెంగళూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): శరావతి నది బ్యాక్‌వాటర్ ప్రాంతం అంబారగొడ్లు - కసలవల్లిల మధ్య దేశంలోనే అత్యంత కీలకమైన కేబుల్ బ్రిడ్జ్ ఈనెల 14న లాంఛనంగా ప్రారంభిస్తున్నట్టు ఎంపీ రాఘవేంద్ర తెలిపారు. శివమొగ్గలో ఆయన మీడియాతో మాట్లాడుతూ దేశంలోనే రెండో అతిపెద్ద కేబుల్ బ్రిడ్జ్ నిర్మాణ పనులు పూర్తయ్యాయన్నారు. ఇటీవల కొన్నిరోజులుగా బ్రిడ్జ్ పరిశీలనకు వాహనాలు నడపడం ద్వారా సామర్థ్యాన్ని పరీక్షలు జరిపారన్నారు. 2.44 కిలోమీటర్ల దూరం ఉండే ఈ బ్రిడ్జ్‌ను రూ.473 కోట్లతో నిర్మించారన్నారు. యడియూరప్ప ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వంద కోట్ల రూపాయలు కేటాయించారని బ్రిడ్జ్ నిర్మాణం గ్రాంట్లను మరో పనికి కేటాయించే ప్రయత్నం జరిగిందన్నారు. అయితే కేంద్ర ఉపరితల రవాణాశాఖ మంత్రి సహకారంతో బ్రిడ్జ్ నిర్మాణం పూర్తయ్యిందన్నారు. ఈనెల 14న కేంద్రమంత్రి నితిన్‌గడ్కరి బ్రిడ్జ్‌ను ప్రారంభిస్తారన్నారు. రెండు విడతల లోడ్ టెస్టింగ్ పూర్తయ్యిందన్నారు. దశాబ్దాలకాలంగా సిగందూరు చౌడేశ్వరిదేవిని దర్శించుకునేందుకు వివిధ రాష్ట్రాలనుంచి వచ్చే భక్తులు లాంచీల్లో ప్రయాణించేవారన్నారు. వర్షాకాలంలో నీరు పెరిగినా లాంచీలు వెళ్లేవి కావని, వేసవిలో నీటిమట్టం తగ్గినా లాంచీలు ముందుకెళ్లేవి కాదన్నారు. ఎట్టకేలకు చౌడేశ్వరి భక్తుల కల సాకారం కానుందన్నారు.

కొవిడ్ వ్యాక్సిన్ కారణం కాదు



● రాష్ట్రంలో వరుస గుండెపోట్లపై నిపుణుల కమిటీ నివేదిక ● 12 పేజీల నివేదికలో పలు సిఫారసులు ● వ్యాక్సిన్‌పై ఐసీఎంఆర్ అధ్యయనానికి సలహా



బెంగళూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గుండెపోటుతో మరణాలు తీవ్రమవుతున్న తరుణంలో రాష్ట్రప్రభుత్వం నియమించిన ప్రత్యేక కమిటీ నివేదికను సమర్పించింది. ప్రధానంగా 40రోజుల వ్యవధిలో హాసన్ జిల్లాలో 27 మంది మృతి చెందడం, వివిధ జిల్లాల్లోనూ 50లోపు వయసు కల్గినవారు మృతి చెందుతుండడంతో ప్రభుత్వం జయదేవ హృద్రోగ సంస్థల డైరెక్టర్ డాక్టర్ కేఎస్ రవీంద్రనాథ్ నేతృత్వంలో పదిమంది నిపుణులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీ జయదేవ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న 45ఏళ్లలోపు 32 మహిళలు సహా 251 మంది రోగులపై సర్వే జరిపింది. దీంతోపాటు కొవిడ్‌కు ముందు, ఆ తర్వాత ఆరోగ్యస్థితిపై అధ్యయనం చేశారు. ఈనివేదికను ప్రభుత్వానికి సమర్పించారు. నివేదికలో హృదయ సంబంధిత సమస్యలకు మధుమేహం, రక్తపోటు, స్థూలకాలం వంటివి ప్రధాన కారణాలుగా ఉన్నాయని, హఠాత్తుగా గుండెపోటుతో మృతి చెందేందుకు నిర్దిష్టంగా ఒక కారణమనేది లేదని నివేదికలో పేర్కొన్నారు. కొవిడ్ తర్వాత గుండెపోటు పెరిగినా దీర్ఘకాలంలో కొవిడ్ కారణమని చెప్పలేమని స్పష్టం చేశారు. కొవిడ్ వైరస్ ప్రభావం ముగిసి మూడేళ్లు అవుతోంది. అధ్యయనంలో ఎక్కువమంది బీపీ, మధుమేహం, ధూమపానం వంటి వ్యసనాలు కల్గినవారు ఉన్నట్లు నివేదికలో పేర్కొన్నారు. హృదయ సంబంధిత జబ్బులతో మృతి చెందేవారు కొవిడ్ బాధితులేనని రూపొందించేందుకు గణాకాంలు కూడా లేవని పేర్కొన్నారు. కొవిడ్ వ్యాక్సిన్ దీర్ఘకాలంలో దుష్పరిణామాలు ఉంటాయనే అంశంపై ఇండియన్ కౌన్సిల్ ఫర్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) తో అధ్యయనం జరిపించాలని నివేదికలో ప్రస్తావించారు.

కొవిడ్ వైరస్‌కు ముందు ఇదే తరహాలో హృదయ రక్తనాళాల సమస్య కల్గిన వారిపై 2019 ఏప్రిల్ 1నుంచి నెలరోజుల పాటు జయదేవ సంస్థలో చికిత్స పొందిన, మృతి చెందినవారి వివరాలను సేకరించి పరిశీలన చేసినట్లు తెలిపారు. ధమనులు, సిరలు బ్లాక్‌ల కారణంగా గుర్తించారు. 2019లో నెలరోజులలో 40ఏళ్లలోపు గుండెపోటుతో మృతి చెందినవారి వివరాలను, ఇటీవల 40ఏళ్లలోపు గుండెజబ్బులతో మృతి చెందినవారి వివరాలను సేకరించి క్రోడీకరించారు. ఏఏ సమస్యలతో ఇబ్బంది పడుతున్నారనే కోణంలో గణాంకాలను సేకరించారు.

కమిటీ సిఫారసులు ఇవే...

యువత గుండెపోటులతో ఆసుపత్రి పాలు కావడం, మృతి చెందడానికి హృద్రోగ సర్వే జరపాలని సూచించారు. గుండెపోటుతో మృతి చెందిన యువతకు పోస్టుమార్టం ఆధారంగా నివేదికలు, జబ్బుబారిన పడినవారి నివేదికలు పొందుపరచాలి. పాఠశాల స్థాయిలోనే గుండె పరీక్షలు చేపట్టాలి. వంశపారంపర్యంగా గుండెజబ్బుల వివరాలకు అనుగుణంగా వైద్య పరీక్షలు జరపాలి. స్థూలకాయం, బీపీ సమస్యలు గుర్తించాలి. హృదయ సంబంధిత జబ్బులు, వాటి కారణాలు, ఆహారం జీవనశైలిలో మార్పులకు సంబంధించి ఆరోగ్య చైతన్యం చేపట్టాలి. ప్రతిరోజూ వ్యాయామం, వాకింగ్ వంటి అలవాట్లు పెంచుకుని, ధూమపానం పూర్తిగా మానివేయడం, డిజిటల్ పరికరాలు చూసే సమయాన్ని తగ్గించడం, నిద్రకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

అధ్యయనం సాగింది ఇలా..

251 మంది గుండెజబ్బు బాధితులనుంచి సమగ్ర వివరాలు సేకరించారు. వీరిలో 87మంది మధుమేహ బాధితులు కాగా 102మంది బీపీ సమస్యలతో బాధపడేవారు ఉన్నారు. 35మంది కొలెస్ట్రాల్ సమస్యలు కల్గినవారు ఉన్నారు. 40మంది వంశపారంపర్యంగా హృదయ సంబంధిత జబ్బులు కలిగి ఉన్నారు. 111మంది ధూమపానం సేవించేవారు కాగా 77మంది బాధితులు ఏ విధమైన ప్రమాదకరమైన అంశాలు లేనివారిగా గుర్తించారు. 19మంది కొవిడ్ వైరస్ సోకినవారు ఉన్నారు. 251మంది రోగుల్లో 249మంది కొవిడ్ వ్యాక్సిన్ పొందినవారు ఉన్నారు. వీరిలో 53మంది ఒక డోస్ తీసుకోగా 180మంది రెండు డోస్‌లు, 17మంది మూడు డోస్‌లు పొందినవారు ఉన్నారు. 144మంది కొవిషీల్డ్, 64మంది కోవ్యాక్సిన్ పొందగా 52మంది ఏ టీకా పొందారనేది సమాచారం లేదన్నారు.


గుండెపోటుల కారణం	శాతం కొవిడ్‌కు ముందు (2019)	ప్రస్తుతం (2025)
మధుమేహం	13.9శాతం	20.5
బీపీ	13.9	17.6
కొలెస్ట్రాల్	34.8	44.1
ధూమపానం	48.8	51
వంశపారంపర్యం	11.6	14.7
స్థూలకాయం	9.3	11.7



గుండెపోట్లకు పలు కారణాలు : జయదేవ డైరెక్టర్ రవీంద్రనాథ్

కొవిడ్ వైరస్ నుంచి కోలుకున్నవారిలో హార్మోన్ల మార్పుతోపాటు పలు అంశాలు గుండెపోట్లకు కారణంగా ఉన్నాయని జయదేవ హృద్రోగ ఆసుపత్రి సంస్థ డైరెక్టర్ డాక్టర్ కేఎస్ రవీంద్రనాథ్ అభిప్రాయపడ్డారు. ప్రమాదకరమైన అంశాలు పెరుగుతున్నట్లు అధ్యయనంలో తెలిసిందన్నారు. ఇలా ఏమాత్రం అనుమానం వచ్చినా కనీసమైన ఆరోగ్య పరీక్షలు వెంటనే జరిపించుకోవడం ఉత్తమమని ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉందన్నారు. జీవనశైలిలో మార్పు తెచ్చుకోవాలని సూచించారు.





తుంగభద్ర నీటి మట్టం :1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1625.26	1,593.19
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	72,490	25.556
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	62,444	190
నీటి నిల్వ (టీఎంసీలు)	77.34	13.90

అగ్నిగుండంలో ఇరుక్కుని
భక్తుడికి గాయాలు

కంప్లి, జూలై 6(ఆంధ్రజ్యోతి): లింగసూగూరు తాలూకాలోని యర్రగుంట గ్రామంలో శనివారం రాత్రి మొహర్రం వేడుకల్లో అపశ్రుతి చోటు చేసుకుంది. శనివారం రాత్రి పీర్లదేవుళ్లను పట్టుకుని అగ్నిగుండంలో తొక్కుతూ భవిష్యవాణి తెలిపే సమయంలో యర్రగుంట గ్రామానికి చెందిన హనుమంతు అనే వ్యక్తికి ప్రమాదం చోటు చేసుకుంది. మద్యం మత్తులో అగ్నిగుండం దాటే సమయంలో అదుపుతప్పి తన ఎడమ కాలు కాలిపోతున్నా, కట్టెల్లో ఇరుక్కుపోవడంతో కొన్ని నిమిషాల పాటు బయటికి రాలేక ఇబ్బంది పడ్డాడు. అగ్నిగుండానికి ఇరువైపులా ఉన్న భక్తులు హనుమంతుని బయటకు లాగారు. అప్పటికే శరీరం కొంతవరకు కాలిపోయింది. వెంటనే లింగసూగూరు ప్రభుత్వాస్పత్రికి చికిత్స కోసం తరలించారు. వేడుకల్లో ప్రమాదంతో గ్రామస్థులు నిరాశకు గురయ్యారు.

ధ్వంసమైన పంట



ధ్వంసమైన చెరకు పంట వద్ద రైతు తిమ్మప్ప

కంప్లి, జూలై6(ఆంధ్రజ్యోతి): కమలాపురం సమీపంలోని నెల్లాపురం క్యాంపు తండా వెంకటాపురం క్యాంపు తదితర ప్రాంతాల్లో చెరుకు రైతులు ఎలుగు బంట్లు, అడవి పందుల దాడులతో తీవ్రంగా నష్టపోతున్నారు. చేతికొచ్చిన పంటలు రేపో.. మాపో.. కోసుకుందాం అనేలోగానే జంతువుల దాడితో లక్షల రూపాయల్లో నష్టపోతున్నామని రైతు తిమ్మప్ప వాపోయారు. జంతువులను పారదోలడానికి నాటు పిస్తోలు తీసుకెళ్దామంటే అధికారులు అనుమతించడం లేదన్నారు.స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు కొండచోడు చుట్టూ కంచె నిర్మించాలని కోరారు.

కుక్క దాడిలో బాలుడికి తీవ్రగాయాలు



గాయపడిన బాలుడు

రాయచూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 8వ వార్డ్ గాలిబ్‌నగర్‌లో ఆదివారం మధ్యహ్నం ఇంటి బయట ఆడుకుంటున్న 4 ఏళ్ల బాలుడు మహ్మద్ నుమాన్ హుసేన్ పై వీధి కుక్క దాడి చేసింది. ఈ దాడిలో బాలుడి దవడ ఎమకలకు, తలకు బలమైన గాయాలు కావడంతో తల్లిదండ్రులు బాలుడిని చికిత్స కోసం రిమ్స్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. కుక్క బాలుడి పై దాడి చేస్తున్న సమయంలో తల్లిదండ్రులు చుట్టుపక్కల వారు ఒక్క సారిగా వెళ్లి కుక్కను తరిమి బాలుడిని విడిపించుకున్నంత పని చేశారు. నగరంలో ఇటీవల కుక్కల దాడులు పెరిగిపోయాయని, అదికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలను సహించం

● కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పద్ధతి మార్చుకోవాలి: జేసీటీయూ ఆగ్రహం ● 9న అఖిల భారత సమ్మెకు పిలుపు

బళ్లారి సిటీ, జూలై 6(ఆంధ్రజ్యోతి): కార్మికులను బానిసత్వంలోకి నెట్టే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయాలపై జేసీటీయూ మండిపడింది. ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక కార్పొరేటివ్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా కేంద్ర కార్మిక సంఘాలు ఈనెల 9న అఖిల భారత సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చినట్లు సీఐటీయూ జిల్లాధ్యక్షుడు సత్యబాబు అన్నారు. ఆదివారం నగరంలోని పత్రికా భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈసమ్మెకు బళ్లారితో సహ రాష్ట్రవ్యాప్తంగా కార్మిక సంఘాల ఉమ్మడి కమిటీ(జేసీటీయూ) నాయకత్వం మద్దతు ఇస్తుందన్నారు. కనీస మద్దతుధర చట్టం, రైతుల ఇతర డిమాండ్లు పరిష్కరించాలన్నారు. రైతు సంఘాలు సమ్మెకు మద్దతునిస్తున్నాయన్నారు. గాంధీభవన్ నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి నిరసన చేపడ్తామన్నారు. వివిధ తాలూకా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు జరుగుతాయి. ఏఐయూటీయూసీ, సీఐటీయూ, ఏఐటీయూసీ ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్, బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్, ఏఎస్‌హెచ్‌ఏ, అంగన్‌వాడీ, బీసీ మీల్ వర్కర్స్ అసోసియేషన్,మైన్ వర్కర్స్ అసోసియేషన్, హాస్టల్, బీఐఎమ్ఎస్, కాంట్రాక్ట్ వర్కర్స్ అసోసియేషన్ , ఇతర ట్రేడ్ యూనియన్లు కర్ణాటక జనశక్తి ఏఐకేకేఎంఎస్, కేపీఆర్ఎస్,కర్ణాట రాజ్య రైతు సంఘ్ వంటి సంస్థలన్నీ సమ్మెలో పాల్గొంటాయన్నారు. ఏఐయూటీయూసీ నాయకులు ప్రమోద్ మాట్లాడుతూ.. బానిసత్వానికి బ్లూప్రింట్ లాంటి కార్మిక నియమావళిని అమలు చేయడానికి, దానిని కార్మికవర్గ ప్రజలపై రుద్దడానికి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జేసీటీయూ నాయకులు

కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. పని గంటలు, కనీస వేతనాలు సమాజిక భద్రత మొదలైనవి కార్పొరేట్ సంస్థలు పట్టించుకోవడం లేదన్నారు. పని, పని చేసే చోట పరిస్థితులు, వ్యవస్థీకృత హక్కు,వారి సామూహిక బేరసాల హక్కులు సాధించడానికే సమ్మె నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా ఆదిమూరి రవాణ శాఖ యూనియన్ అధ్యక్షుడు సోమశేఖర్‌గౌడ, హనుమంతప్ప ఏఐకేకేఎంఎస్, సూర్యనారాయణ అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం, శివశంకర్ కేపీఆర్ఎస్, సంగనకల్ కృష్ణ కర్ణాటక రైతు సంఘం తదితరులు పాల్గొన్నారు.

పనులు త్వరగా పూర్తిచేయాలి

● ఎల్ఎల్‌సీని పరిశీలించిన రైతు సంఘం నాయకులు



వంతెన పనులను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

కంప్లి, జూలై6(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాశయం కింద ఎడమ కాలువ(ఎల్ఎల్‌సీ) కాలువలో 9, 15, 70 కిలోమీటర్ల వద్ద జరుగుతున్న వంతెన పనులు త్వరగా పూర్తి చేయాలని జిల్లా రైతు సంఘం హసురుసేన జిల్లా అధ్యక్షులు బీసీ గౌడ తెలిపారు. ఆదివారం కంప్లిలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాలువలకు నీరు విడుదల చేసే సమయంలో కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం వహించి పనులు పూర్తి చేయకపోతే రైతులకు సకాలంలో నీరు అందడం కష్టమవుతుందన్నారు. పనులపై అధికారులు దృష్టిసారించి త్వరగా పూర్తయ్యేలా చూడాలన్నారు. ఖరీఫ్ పంటల అనంతరం జలాశయం క్రస్ట్ గేట్ల పనులు ప్రారంభించి త్వరగా ముగించేలా చూడాలన్నారు. అంతకు ముందు వారు కాలవ మరమ్మతు పనులను పరిశీలించారు. వారితో పాటు రైతు సంఘం నాయకులు కొట్టూరు రమేష్, తిమ్మప్ప నాయక, మురారి గోవిందప్ప, విరూపన్న పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం



మహేష్ కుమార్

సిరుగుప్ప, జూలై6(ఆంధ్రజ్యోతి): బుద్ధిమాంద్య పిల్లలకు ఉచిత శిక్షణ కోసం డాక్టర్ బీమా విద్యాసంస్థ జ్ఞానోదయ బుద్ధిమాంధ్య పిల్లల వసతి పాఠశాలలో అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని సంస్థ వ్యవస్థాపకులు మహేష్‌కుమార్ తెలిపారు. ఆదివారం విలేకరులతో మాట్లాడిన ఆయన సిరుగుప్పలోని సింధనూరు రోడ్డు మార్గంలో 1వ వార్డులో ఈ సంస్థ కార్యాలయం వున్నట్లు తెలిపారు. 6 నుంచి 25 సంవత్సరాల వయసు గల పిల్లలు ఈ ఉచిత శిక్షణ కోసం అర్హులన్నారు. వీరికి ప్రత్యేక శిక్షణ ఇవ్వబడుతుందన్నారు.

త్రైతసిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



ప్రచారంలో జ్ఞానవేదిక కమిటీ సభ్యులు

బళ్లారి సిటీ, జూలై6(ఆంధ్రజ్యోతి): త్రైతసిద్ధాంత ప్రబోధ సేవాసమితి జ్ఞానవేదిక ఉరవకొండ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో బళ్లారి జిల్లా గోనేహాల్ గ్రామంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు రామాజంనేయులు మాట్లాడుతూ.. త్రైతసిద్ధాంత భగవద్గీత శ్రీకృష్ణుడి అసలైన జ్ఞానాన్ని తెలియజేస్తుందన్నారు. వేదిక అధ్యక్షుడు రామాంజనేయులు, సురేశ్, కృష్ణవేణి, సువర్ణ, ఎల్లమ్మ, ఉమాదేవి, సుమతి, హేమావతి, చందు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం

రాయచూరు, జూలై 6(ఆంధ్రజ్యోతి): మొహర్రం వేడుకలు ముగించుకుని వెళ్తూ రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. మస్కి తాలూకా వీరాపుర గ్రామానికి వెళ్లి తిరిగి వస్తున్న ఇద్దరు యువకులు బైక్ బోల్తాతో కందకంలో పడి మృత్యువాతపడ్డారు. వీరిని సింధనూరు తాలూకా దేవినగర్ క్యాంప్‌కు చెందిన కరణకుమార్(25) సింధనూరు నగర వాసి రమేశ్(26)గా గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించిన తుర్విహాళ్ సబ్ ఇన్స్‌పెక్టర్ సుజాతా నాయక్, పంచనామా నిర్వహించి శవాలను పోస్ట్‌మార్టం కోసం సింధనూరు ఆస్పత్రికి తరలించారు.



కరణకుమార్ మృతదేహం



రమేశ్

కంకర రోడ్డును బాగు చేయండి ప్లీజ్..!

కంప్లి, జూలై6(ఆంధ్రజ్యోతి): తాలుకా పరిధిలోని శ్రీరామరంగాపురం నుంచి గోనాల్ వరకు, గోనాల్ నుంచి హంపిదేవనహళ్లి వరకు రోడ్డు పనులు చేపట్టాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు. ఎన్నో సంవత్సరాలుగా రోడ్డుకు మరమ్మతు చేపట్టకపోవడంతో రైతులు, విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. కురుగోడు యల్లాపురం క్రాస్ నుంచి మారుతి క్యాంపు, శ్రీరామరంగాపురం గోనాల్ జవుకు మెట్రీ మీదుగా హంపికి చేరుకుని వెళ్లాల్సివస్తోందన్నారు. శ్రీరామరంగాపురంలో ఆరోగ్య కేంద్రం వుండటంతో జవుకు, హంపేదేవనహళ్లి, చిక్కజాగనూరు రెగ్యులేటరీ జీనూరు గ్రామాల ప్రజలు చికిత్స కోసం శ్రీరామరంగాపురం వెళ్లాలన్న గోనాల్, శ్రీరామరంగాపురం రోడ్డు బాగా లేకపోవడంతో సుగ్గినళ్లి మీదుగా శ్రీరామరంగాపురం రోడ్డు బాగా లేకపోవడంతో సుగ్గినళ్లి మీదుగా శ్రీరామరంగాపురం చేరుకుంటున్నారు. మూడు కిలోమీటర్ల బదులుగా ఆరు నుండి ఏడు కిలోమీటర్లు తిరిగి రావలసిన పరిస్థితి ఏర్పడిందన్నారు. రాత్రివేళలో రోడ్డుపై ప్రయాణించిన వారు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారని, చుట్టుపక్కల గ్రామాల్లో అన్ని రోడ్లు అభివృద్ధి చెందుతున్నాయి. గోనాల్ శ్రీరామరంగాపురం రోడ్డు మాత్రం అభివృద్ధికి నోచుకోలేక ఇబ్బంది పడుతున్నామని శ్రీరామరంగాపురం గ్రామస్థులు రవి వెంకటేష్ భాస్కర్ పోలప్ప వాపోయారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు శ్రీరామరంగాపురం గోనాల్ రోడ్డును అభివృద్ధి చేపట్టి రైతులకు ప్రజలకు విద్యార్థులకు ప్రయాణికులకు ఎలాంటి సమస్య లేకుండా చూడాలని కోరారు.



రాళ్లు తేలిన శ్రీరామ రంగాపురం-గోనాల్ రోడ్డు



ఉచ్చంగి దుర్గ కొండపై పురావస్తు శాఖ అధికారులు

ఉచ్చంగి కొండను సందర్శించిన అధికారులు

బళ్లారి సిటీ, జూలై 6(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా హరపనహళ్లిలోని చారిత్రాత్మక ఉచ్చంగి దుర్గ కొండను పురావస్తుశాఖ అధికారుల బృందం సందర్శించింది. స్మారక చిహ్నాలపై గాడిదలు, పశువులు తిరగడం వల్ల సమస్యపై గ్రామస్థులు భక్తులతో చర్చించారు. రాతిపై నిర్మించిన కోట చుట్టూ పశువుల సంచారం కారణంగా భక్తులు ఎదుర్కొంటున్న సమస్యలను, స్మారక చిహ్నాలను పరిశీలించారు. కొండపై గాడిదలు, పశువుల సంచారాన్ని పూర్తిగా నిషేధించడంపై త్వరలో తుది నిర్ణయం తీసుకునే అవకాశం గురించి ఆలయ కార్యనిర్వాహక అధికారి మల్లప్పతో చర్చించారు. పురావస్తు శాఖ, ముజ్రాయిశాఖ ఆటవీ శాఖల మధ్య గందరగోళం కారణంగా కొండపై ఎటువంటి అభివృద్ధి పనులు జరగలేదు. ప్రతి సంవత్సరం 25లక్షల మంది భక్తులు సందర్శించే ఉచ్చంగె మ్మ దేవి కొండను ప్రాథమిక సౌకర్యాలతో సహా అభివృద్ధి చేయాలని గ్రామస్థులు కోరారు. ఈసందర్భంగా సర్కిల్ సూపరింటెండెంట్ పురావస్తు శాఖాధికారి రామకృష్ణారెడ్డి, డిప్యూటీ సూపరింటెండెంట్ ఇంజినీర్ భరణీధరన్, అసిస్టెంట్ ఇంజనీర్ వినోద్‌కుమార్, కన్జర్వేషన్ అసిస్టెంట్ సునీల్‌కుమార్, ముజరాయి విభాగం మల్లప్ప, గంగాధర్, రేవణసిద్ద శివాచార్య స్వామీజీ, కెంచప్ప, శివకుమార్‌స్వామి తదితరులున్నారు.

నేడు పత్రికా దినాచరణ

బళ్లారిరూరల్, జూలై 6(ఆంధ్రజ్యోతి): నగరంలోని పాత కలెక్టర్ కార్యాలయం వెనుక భాగంలో ఉన్న గాంధీభవన్లో కర్ణాటక వర్కింగ్ జర్నలిస్టు అసోసియేషన్ ఆధ్వర్యంలో పత్రికా దినాచరణ సోమవారం నిర్వహించనున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ముఖ్యమంత్రి మీడియా సలహాదారులు కేవీ ప్రభాకర్ హాజరయి ప్రారంభిస్తారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు శివానంద్ తగడూరు అధ్యక్షతన సభ నిర్వహిస్తారు. ఈ పత్రిక దినచర్ల కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బళ్లారి నగర ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, శాసనమండలి సభ్యులు వైఎం సతీష్ మేయర్ ముల్లంగి నందీష్, మధ్య ప్రొఫెసర్ శివ కుమార్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లోకేష్, కార్యదర్శి సోమశేఖర్, కిరేగౌడ, డీసీ ప్రశాంత్ కుమార్ మిశ్రా, ఎస్పీ డాక్టర్ శోభారాణి, జిల్లా వార్త అధికారి తుకారాం, సంఘం రాష్ట్ర కార్యక్రమాన్ని సభ్యులు ఎస్ వీరభద్రగౌడ అడ్డా కమిటీ సభ్యులు మల్లయ్య మోకా యకోబా పాల్గొంటారు. కార్యక్రమంలో జర్నలిస్టు విద్యార్థులకు పీయూసీ, ఎస్ఎస్ఎల్‌సీ ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రశంసాపత్రంతో పాటు క్రీడల్లో పాల్గొన్న క్రీడాకారులకు బహుమతులు అందిస్తున్నట్లు సంఘ సభ్యులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం



పీడీహళ్లిలో కొలువుదీరిన పీర్లు

బళ్లారిరూరల్, జూలై6(ఆంధ్రజ్యోతి): తాలుకాలోని మోకా, రూపనగుడి, హగరి, వీరాపురం, కారేకల్, కప్పగల్ తదితర గ్రామీణ ప్రాంతాల్లో మొహర్రం పండుగను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పీర్ల చావిడుల వద్ద భక్తాదులు పెద్దఎత్తున చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు.

భక్తులకు శీతల పానీయాల పంపిణీ

బళ్లారి సిటీ/సిరుగుప్ప(ఆంధ్రజ్యోతి): మొహర్రం వేడుకల్లో భాగంగా స్వామియార్ వేల్ఫేర్ సర్వీసెస్ ట్రస్ట్ సయ్యద్ వలీ సాహెబ్‌ట్రస్ట్ సహకారంతో నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఆదివారం భక్తులకు శీతల పానీయాలు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో సయ్యద్ షాబాజ్, గౌస్, రఫీక్, ఆలీ, రేణుకా బేకరీ యజమాని అన్నప్ప శెట్టి, నవాజ్, తదితరులు పాల్గొన్నారు. సిరుగుప్ప పట్టణ వ్యాప్తంగా మొహర్రం వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. గుండాలు ఏర్పాటు చేసి భక్తులు అందులో నడిచి మొక్కులు తీర్చుకుంటున్నారు.



శీతల పానీయాలు పంపిణీ చేస్తున్న స్వామియార్ ట్రస్ట్ సభ్యులు

హోసూరు జోన్

వరదరాజస్వామి ఆలయంలో
విశేష పూజలు



అలంకరణలో వరదరాజస్వామి

హోసూరు, జూలై 6(ఆంధ్రజ్యోతి): చాతుర్మాస్య తొలిరోజును పురస్కరించుకుని వరదజాస్వామి ఆలయంలో ఆదివారం విశేషపూజలు కొనసాగాయి. నాలుగు నెలలపాటు పవిత్రదీక్షలు కొనసాగిస్తారు. ఆషాఢశుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని పట్టణంతోపాటు ఆలయాలలో విశేషపూజలు నిర్వహించారు. కృష్ణగిరి జిల్లాలోని హోసూరు, డెంకణీకొట్టై, శూలగిరి, అంచెట్టి తాలూకాలలో కన్నడ మాట్లాడేవారు ఆషాఢమాసం పురస్కరించుకుని చాతుర్మాస్య దీక్షను పాటిస్తారు. స్వామివారికి విశేషపూజల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

హోసూరు అభివృద్ధికి ప్రాజెక్టులు తప్పనిసరి

● మాజీ ఎమ్మెల్యే మనోహరన్

హోసూరు, జూలై 6(ఆంధ్రజ్యోతి): పరిశ్రమలకు కేంద్రంగా ఉన్న హోసూరు అభివృద్ధికి వేగవంతమైన ప్రాజెక్టులు అమలు చేయాలని ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే మనోహరన్ అభిప్రాయపడ్డారు. ఐఎన్‌టీయూసీ ట్రేడ్ యూనియన్ కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. బస్టాండ్ ఎదురుగా ఉన్న ఫ్లైఓవర్‌పై పగుళ్ల నేపథ్యంలో మరమ్మతుల కారణంగా ట్రాఫిక్‌ను మళ్ళించడంతో ఎటుచూసినా రద్దీ నెలకొందన్నారు. బాగలూరు రోడ్డుపై మరమ్మతు పనులు నత్తనడకన సాగుతున్నాయన్నారు. చెన్నై-బెంగళూరు వెళ్లే మార్గంలో భారీ వాహనాలు రోడ్డుపై నిలబడడంతో ట్రాఫిక్ నెలకొంటోందన్నారు. నగరంలో నెలకొన్న ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ కార్యనిర్వాహకులు మునిరాజ్, భక్తవత్సలం, సత్యమూర్తి, సుకుం మారప్పన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి మనోహరన్



విలేకరులతో మాట్లాడుతున్న రైతుసంఘం నాయకులు

విద్యుత్ సవరణ చట్టాలపై రైతుల అభ్యంతరం

హోసూరు, జూలై 6(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సవరణ చట్టాలపై రైతుసంఘం అభ్యంతరం వ్యక్తం చేసింది. కృష్ణగిరి కొత్తబస్టాండ్ సమీపాన తమిళనాడు కిసాన్‌సంఘం తరఫున బహిరంగసభ నిర్వహించారు. పీఆర్ పాండ్యన్ మీడియాతో మాట్లాడుతూ 13మంది రైతులను బలి ఇచ్చి ఉచిత విద్యుత్ పొందారన్నారు. తమిళనాడు ప్రభుత్వం కూడా కేంద్ర విద్యుత్‌చట్టాలను ఆమోదించిందని అయితే తాము ఖండిస్తున్నట్టు తెలిపారు. సహకారసంఘాలు రైతులకు రుణాలు ఇచ్చే హక్కును కోల్పోయాయన్నారు. రిజర్వుబ్యాంకు నియమాలకు అనుగుణంగా సిబిల్‌స్కోర్ అడగబోమని మంత్రి పెరియ కరుప్పన్ చెబుతున్నారని, అయితే సిబిల్ స్కోర్‌ను నిర్ధారించిన తర్వాతే రుణాలు ఇవ్వాలని సహకారసంఘాల రిజిస్ట్రార్ సర్క్యులర్ పంపారని, దీనిపై సీఎం స్పష్టత ఇవ్వాలన్నారు. కాగా కర్ణాటక నుంచి వచ్చే వ్యర్థాల కారణంగా తెన్‌పెన్నై నది మురుగు కాలువగా మారిందని, చేపలు సైతం చనిపోయి తేలుతున్నాయని, నీరు తాగేందుకు యోగ్యంగా లేవన్నారు. నదులలో వ్యర్థాలు కలవకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జాతీయ చీఫ్ కో-ఆర్డినేటర్ జగ్జీత్‌సింగ్ థల్లేవాల్, తమిళనాడు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామగౌండర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై పశువుల పట్టివేత

రాయచూరు, జూలై 6(ఆంధ్రజ్యోతి): నగరంలోని రోడ్లపై విచ్చల విడిగా సంచరిస్తున్న విడి పశువులను నియంత్రించేందుకు ఎట్టకేలకు మహానగర పాలిక అధికారులు నడుం బిగించారు. శనివారం రాత్రి నుంచి పెద్ద ఎత్తున నగర వ్యాప్తంగా కార్యాచరణ చేపట్టిన మహానగర పాలిక అధికారులు దాదాపు 60కిపైగా పశువులను గుర్తించి వాటిని స్థానిక వర్ధమాన్ పాఠశాల ఆవరణలో బంధించారు. వీటిలో 30 పశువులకు పైగా గో శాలలకు తరలించిన అధికారులు మిగితా వాటిని యజమానులకు జరిమానాలు విధిస్తున్నట్లు తెలిపారు. అనేక చోట్ల ప్రమాదాలు జరుగుతున్నట్లు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో మహానగర పాలిక కమిషనర్ ఇచ్చిన ఆదేశాల మేరకు సిబ్బంది పశువుల పట్టివేతను ముమ్మరంగా చేపట్టారు.



పశువులను గోశాలకు తరలిస్తున్న దృశ్యం

బడి బాగుంటేనే...
భావితరాలకు మేలు

● ఓ తండ్రి గొప్ప ఆలోచన.. కుమారుడి జ్ఞాపకార్థం పాఠశాలలను దత్తత తీసుకున్న గొడితి కాశీ విశ్వనాథ్ చౌదరి



పెయింటింగ్ పనులను పరిశీలిస్తున్న విశ్వనాథ్ చౌదరి

బళ్లారి, జూలై 6(ఆంధ్రజ్యోతి): చేతి కొచ్చిన కుమారుడిని కాలం కనుమరుగు చేసింది. కొడుకు తల్లిదండ్రులను వదిలి ఈలోకం నుండి వెళ్లిపోయినా తన కుమారుడు జ్ఞాపకం చిరస్థాయిగా నిలవాలనే ఆ తల్లిదండ్రులు నిర్ణయించుకున్నారు. ఏదో ఒకరోజు పది మందికి అన్నదానం చేసి చేతులు దులుపుకుంటే సరిపోతుంది అని అనుకోలేదు వారు. ఏమైనా మంచి పని చేయాలి, అది భావితరాలకు ఉపయోగ పడాలి. అని సంకల్పించుకున్నారు. సింధనూరువాసి గొడితి కాశీ విశ్వనాథ్ చౌదరి, గొడితి విశ్వనాథ్ చౌదరి దంపతులకు గొడితి నాగేశ్వరనాథ్ ఒక్కగాని ఒక్కడే కుమారుడు. ఇటీవల ఆయన అకాల మరణం చెందారు. కుమారుడు జ్ఞాపకార్థం గొడితి నాగేశ్వరనాథ్ టారిటబుల్ ట్రస్టును స్థాపించారు. సింధనూరులో ఉన్న ప్రతి ప్రభుత్వ పాఠశాలను దత్తత తీసుకున్నారు. పట్టణ పరిధిలో సుమారు 200కు పైగా ప్రభుత్వ పాఠశాలు ఉన్నాయి. పాఠశాలలకు మౌలిక సౌకర్యాలు కల్పించడం, ప్రతి పాఠశాలకు గదికి కలర్ వేయించడం చేశారు. ఆయన చేసిన మంచి సంకల్పానికి స్థానిక కమ్మ సంఘాలు, తెలుగు సంఘాలు, ఇతర అనేక మంది పెద్దలు సహకరించారు. తాము కూడా పాఠశాలల గదులకు కలర్ వేసి మౌలిక సదుపాయం కల్పనకు చేతులు కలిపారు. ఇప్పుడు సింధనూరులో ప్రభుత్వ పాఠశాలలు కళకళలాడుతున్నాయి. సింధనూరు తాలూకాలో ఉండే అన్ని ప్రభుత్వ పాఠశాల గదులు రంగులు వేసేందుకు దాతలు ముందుకొచ్చారు. దీనికి ప్రధానంగా కమ్మ గొడితి విశ్వనాథ్ చౌదరి మార్గదర్శిగా నిలిచారు. సోమవారం సింధనూరులోని మూళ్యారు క్యాంపు లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో గొడితి నాగేశ్వరనాథ్ జయంతి వేడుకలు జరుపుతున్నట్లు తండ్రి విశ్వనాథ్ చౌదరి తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకునే పాఠశాలల అభివృద్ధికి పూనుకున్నట్లు తెలిపారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి (జయంతి)



'కళాప్రపూర్ణ' గ్రహీత మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి 1914 జూలై 7న గుంటూరు జిల్లా లింగాయపాలెంలో జన్మించారు. 15వయేట స్వాతంత్ర్యోద్యమంలో అడుగుపెట్టి అనంతరం కమ్యూనిస్టు ఉద్యమంలోనూ, క్విట్ ఇండియా ఉద్యమంలోనూ పాల్గొన్నారు. స్వాతంత్ర్యానంతరం నిజాం నవాబుకి వ్యతిరేకంగా సాగిన పోరాటంలోనూ చురుగ్గా పాల్గొన్నారు. తదుపరి మిత్రుడు కేఎస్ ప్రకాశరావు ప్రోత్సాహంతో సినీరంగంలోకి ప్రవేశించారు. ఎన్టీఆర్‌తో కలసి ఆయన సుమారు 150 చిత్రాల్లో నటించారు. పౌరాణిక చిత్రాలతో పేరొందారు. తన ఉన్నతికి కారణమైన నాటక, జానపద రంగాన్ని విస్మరించలేదాయన. 'ఎన్టీఆర్ ఆత్మగౌరవ పురస్కారం' ఇతర అవార్డులు పొందారు. 2011 ఫిబ్రవరి 23న కన్నుమూశారు.

దిలీప్‌కుమార్ (వర్ధంతి)



'పద్మవిభూషణ్' దిలీప్‌కుమార్ 1922 డిసెంబరు 11న ప్రస్తుత పాకిస్థాన్‌లోని పెషావర్‌లో జన్మించారు. ఆయన అసలు పేరు మొహ్మద్ యూసుఫ్ ఖాన్. సినిమాల కోసం పేరును మార్చుకున్నారు. హిందీ సినీ రంగంలో ట్రాజెడీ కింగ్‌గా పేరొందారు. 'ది ఫస్ట్ ఖాన్' ఆఫ్ బాలీవుడ్‌గా గుర్తింపు పొందారు. అత్యధిక పురస్కారాలు పొందిన భారతీయ నటుడిగా గిన్నిస్‌బుక్‌లో చోటు సంపాదించారు. ఏకంగా ఎనిమిదిసార్లు ఫిలింఫేర్ పురస్కారం అందుకున్నారు. పద్మభూషణ్, దాదాసాహెబ్ ఫాల్కే, ఎన్టీఆర్ జాతీయ పురస్కారం పొందారు. కాగా రాజ్యసభ సభ్యుడిగా 2000 నుంచి 2006వరకు కొనసాగారు. 98వ ఏట 2021 జూలై 7న కన్నుమూశారు.

నేమని సోమయాజులు (పుట్టినరోజు)



'జలతరంగ కళాప్రవీణ' గ్రహీత నేమని సోమయాజులు 1950 జూలై 7న శ్రీకాకుళంలో జన్మించారు. తెలుగు రాష్ట్రాలలో ఏకైక జలతరంగ్ కళాకారుడిగా పేరొందారు. జలతరంగ్ వాదనలో శాస్త్రీయసంగీతం పలికించడం ఆయన ప్రత్యేకత. 15 కప్పులలో నీటిని నింపుతారు. రాగాలకు అనుగుణంగా కప్పులలోని నీటిమట్టం మారుతూ ఉంటుంది. మృదంగం, ఘటంలోనూ సిద్ధహస్తులు. ఆలిండియా రేడియోలో 'ఏ' గ్రేడ్ ఘటం కళాకరులు. ప్రపంచ వ్యాప్తంగా ప్రదర్శనలు ఇచ్చి పలు అవార్డులు పొందారు.

జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు (పుట్టినరోజు)



పేరడీలతో పేరొందిన ప్రముఖ తెలుగు కవి జొన్నవిత్తుల రామలింగేశ్వర రావు 1959 జూలై 7న విజయవాడలో జన్మించారు. సినీ గేయ రచయితగా పేరొందారు. 600కుపైగా పాటలు రాశారు. తెలుగు అధికార భాషాసంఘం మాజీ సభ్యుడు. ప్రత్యేకించి పేరడీలు రాయడంలో ప్రసిద్ధులు. బాపు దర్శకత్వంలోని 'శ్రీరామరాజ్యం' సినిమాలోని పాటలకు 'ఫిల్మ్‌ఫేర్ ఉత్తమ గేయరచయిత' పురస్కారం పొందారు. శ్రీశ్రీగారి మహాప్రస్థానం, జంధ్యాల పాపయ్య శాస్త్రిగారి పుష్పవిలాపం వంటి వాటికి పేరడీలు రాశారు. తనికెళ్ళభరణి దర్శకత్వంలోని 'మిథునం' సినిమాకు రాసిన కాఫీదండకం ఎంతో పేరొందింది. 2005లో 'పెళ్లాం పిచ్చోడు' సినిమాకు దర్శకత్వం వహించి నంది అవార్డు పొందారు.

కైలాష్ ఖేర్ (పుట్టినరోజు)




'పద్మశ్రీ' గ్రహీత, నేపథ్య గాయకుడు కైలాష్ ఖేర్ 1973 జూలై 7న మీరట్‌లో జన్మించారు. స్వరకర్తగా, సంగీతదర్శకుడిగా జానపదం, సూఫీలలో తన ప్రత్యేకత చాటుకున్నారు. గజల్, సూఫీ, ఖవ్వాళీ, జానపద గేయాలాపన ఆయన ప్రత్యేకత. 20కుపైగా భాషలలో 500కుపైగా పాటలు పాడారు. హిందీలో వెయ్యికి పైగా పాటలను రేడియో, బుల్లితెర ప్రకటనలకోసం పాడారు. తెలుగులో పరుగు, అరుంధతి, ఆకాశమంత సినిమాల్లో పాడారు. ప్రైవేట్ ఆల్బమ్స్ రూపొందించారు. ఫిల్మ్‌ఫేర్, నంది, స్టార్ స్క్రీన్ అవార్డ్స్ అందుకున్నారు.

ఎంఎస్ ధోని (పుట్టినరోజు)



'పద్మభూషణ్' గ్రహీత ఎంఎస్ ధోని 1981 జూలై 7న రజపుత్ కుటుంబంలో జన్మించారు. ఇండియన్ క్రికెట్‌లో వికెట్ కీపర్, బ్యాట్స్‌మన్, కేప్టెన్‌గా తనదైన రికార్డును సృష్టించారు. ఆయన కేప్టెన్సీలో 2007లో ఐసీసీ వరల్డ్ ట్వంటీ-20, 2010, 2016లో ఏసియా కప్, 2011 ఐసీసీ క్రికెట్ వరల్డ్‌కప్, 2013 ఐసీసీ వరల్డ్ చాంపియన్ ట్రోఫీలు లభించాయి. 10వేల కంటే ఎక్కువ పరుగులలోనూ, వన్డేలలో 150కుపైగా వికెట్‌లు తీసిన ఘనత ఆయనది. రాజీవ్ ఖేల్‌రత్న, పద్మశ్రీ వంటి ఉన్నత పురస్కారాలు అందుకున్నారు. ఇండియన్ టెరిటోరియల్ ఆర్మీ ఆయనకు 'లెఫ్టినెంట్ కల్నల్'గా గౌరవ హోదా కల్పించింది. 2020లో రిటైర్మెంట్ ప్రకటించారు.

హనుమంతుడి ఆలయంలో నటుడు యువరాజ్



పూజలు నిర్వహిస్తున్న యువరాజ్

రాయచూరు, జూలై 6(ఆంధ్రజ్యోతి): యువ నటుడు దివంగత అగ్ర కథ నాయకుడు డాక్టర్ రాజ్‌కుమార్ మనుమడైన యువరాజ్ కుమార్ ఆదివారం నగరంలో కొద్దిసేపు హల్‌చల్ చేశారు. ఈ నెల 17న ఆయన నటించిన ఎక్క చిత్రం విడుదల కానున్న నేపథ్యంలో మంత్రాలయం దర్శనానికి వచ్చిన ఆయన నగరానికి చేరుకుని స్థానిక గాంధీచౌక్‌లోని హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అభిమానులు అందజేస్తున్న అండదండలు మరువలేనివన్నారు.

ఘనంగా లక్ష్మీవేంకటరమణస్వామి రథోత్సవం



లక్ష్మీవేంకటరమణస్వామి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



రథోత్సవంలో కళాకారులు, చిన్నారుల సందడి

విజయపుర, జూలై6(ఆంధ్రజ్యోతి): దేవనహళ్ళి తాలూకా విజయపుర బలిజపేటలో కొలువైన లక్ష్మీవేంకటరమణస్వామి ఆలయ 20వ వార్షిక కల్లుగాలి బ్రహ్మరథోత్సవం, 65వ వార్షిక అఖండ శ్రీరామనామసప్తాహం ఆదివారం వైభవంగా జరిగింది. ఆషాఢశుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని పట్టణంలోని పలు ఆలయాలలో ప్రత్యేక పూజలు కొనసాగాయి. లక్ష్మీవెంకటరమణస్వామి ఆలయంలో మూడురోజులుగా పలు కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. కల్యాణోత్సవం, పల్లకీ ఉత్సవం జరిగింది. పూలంగిసేవ, అఖండరామనామ సప్తాహం, పూర్ణాహుతి, కల్యాణోత్సవం జరిగాయి. ఆదివారం సాయంత్రం రథోత్సవాన్ని పురసభ అధ్యక్షురాలు భవ్యమహేశ్ లాంఛనంగా ప్రారంభించారు. టౌన్‌హాల్ సర్కిల్‌నుంచి రథోత్సవం సాగింది.



చన్నకేశవస్వామికి పుష్పాభిషేకం

వీరగాసె, పండరీపుర భజనలు సాగాయి. అఖిల కర్ణాటక బలిజసంఘం ప్రధాన కార్యదర్శి సీకే జగదీశ్, పురసభ మాజీ అధ్యక్షులు ఎం సతీశ్ కుమార్, రాజేశ్వరి భాస్కర్, సభ్యులు రాము, కేశవప్ప, మంజుళా మునిరాజు, రామయ్య, విమల తదితరులు పాల్గొన్నారు.

సౌమ్యకేశవస్వామికి లక్ష పుష్పార్చన

కాగా పట్టణంలోని సౌమ్యకేశవస్వామి ఆలయంలో స్వామివారికి లక్ష పుష్పాలతో పుష్పార్చన చేశారు. ఆలయ అర్చకులు రాజు భట్టాచార్య మాట్లాడుతూ దక్షిణాయనం నుంచి ఉత్తరాయనానికి ప్రవేశించే పుణ్యకాలమన్నారు. ఈ సందర్భంగానే స్వామికి విశేష అలంకరణ జరిగిందన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తే లక్ష్యం

» 405 మందికి మెరిట్ స్కాలర్‌షిప్‌ల పంపిణీ



స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్న నరేంద్ర, ఆలయ ట్రస్టు అధ్యక్షుడు మేడా రామకృ

బొమ్మనహళ్ళి, జూలై 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాగా చదివి సమాజంలో ఉన్నత హోదాలకు ఎదగాలని ఉజ్వల భవిష్యత్తు దిశగా సాగాలనే లక్ష్యంతో స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేస్తున్నామని సాయిబాబా ఆలయ ట్రస్టు అధ్యక్షుడు మేడా రామకృష్ణ తెలిపారు. అరికెరె శాంతినికేతన్ లే అవుట్‌లోని సాయిబాబా దేవస్థానంలో మెరిట్ విద్యార్థినీ విద్యార్థులకు ఒకటో తరగతి నుంచి డిగ్రీ వరకు ఆదివారం స్కాలర్‌షిప్‌లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ గత 8 సంవత్సరాలుగా ఆలయ ట్రస్టు తరపున అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఏటా స్కాలర్‌షిప్‌లు ఇస్తూ ప్రోత్సహిస్తున్నామని, మధ్యతరగతి వర్గాల ప్రజలకు కొంతమేరకైనా ఉపశమనం కల్పించేలా చేయూత ఇస్తున్నట్టు తెలిపారు. ఈ సంవత్సరం 405మంది విద్యార్థినీ విద్యార్థులకు మెరిట్ ప్రాతిపదికన సుమారు 16 లక్షల రూపాయల విలువైన స్కాలర్‌షిప్‌లు అందచేశామన్నారు. కాగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల పేద విద్యార్థులకు నోటు పుస్తకాలు, బ్యాగులు, రాత సామగ్రి ఇస్తున్నామన్నారు. గత ఏడాది గ్రామీణ ప్రాంతాలలో ఇచ్చామని ఈ ఏడాది త్వరలోనే చేపడతామన్నారు. ఎనిమిదేళ్లుగా తాము చేస్తున్న సామాజిక సేవలకు దాతల సహాయ సహకారాలు ఎంతో ఉన్నాయన్నారు. ముఖ్యఅతిథిగా రమ్యప్రింటర్స్ అధినేత నరేంద్ర మాట్లాడుతూ చక్కగా చదివి ప్రయోజకులు కావాలని, చదువుతోపాటు క్రమశిక్షణ పాటించాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా దాతలను, ముఖ్యులను ఆత్మీయంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టు కార్యదర్శి తాతయ్యగుప్త, మనోహర్ గుప్త, హరినారాయణ, కేజీ సుబ్బరాజ్, కేవీకే శెట్టి, టీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



పెద్దసంఖ్యలో పాల్గొన్న విద్యార్థులు

రేపటి నుంచి కైవారలో గురుపూజా సంగీతోత్సవం



విద్యుద్దీపాల వెలుగులో కైవార తాతయ్య మఠం



భారీ షామియానా ఏర్పాటు చేస్తున్న దృశ్య

» 72 గంటల ఉత్సవానికి ఏర్పాట్లు

చింతామణి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని శ్రీక్షేత్రం కైవార యోగి నారేయణమఠంలో గురుపూర్ణిమను పురస్కరించుకుని 72 గంటలపాటు గురుపూజా సంగీతోత్సవం జరగనుంది. ఈనెల 8నుంచి జరిగే ఉత్సవాలకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. కైవార క్షేత్ర ధర్మాధికారి డాక్టర్ ఎంఆర్ జయరాం నేతృత్వంలో 25ఏళ్లుగా గురుపూజా సంగీతోత్సవం నిర్వహిస్తున్నారు. మంగళవారం ఉదయం 6 గంటలకు సంగీతోత్సవాన్ని ప్రారంభించనున్నారు. కైవార క్రాస్‌లో భారీ స్వాగతతోరణం ఏర్పాటు చేశారు. కైవారమఠంలో ఇప్పటికే విద్యుద్దీపాలతో అలంకరణ చేశారు. మరోవైపు భారీ షామియానా ఏర్పాట్లు చేస్తున్నారు. సంగీతోత్సవానికి జాతీయ, రాష్ట్రస్థాయి స్థానిక కళాకారులు పాల్గొని తమ ప్రతిభను చాటనున్నారు. పలు ప్రాంతాలనుంచి పెద్దసంఖ్యలో భజనా మండలులు పాల్గొననున్నాయి. భరతనాట్యం, కూచిపూడి నృత్యం, కథ, కీర్తన, వీణావాదన, నాదస్వరం, హరికథ, బుర్రకథ, వేణుగానం, డొళ్ళుకుణిత, పండరిభజన, కోలాటం, తోలుబొమ్మలాట తదితర కళాకారులు పాల్గొననున్నారు.

నగరంలో పలుచోట్ల ముద్రధారణ

బెంగళూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): తొలి ఏకాదశిని పురస్కరించుకుని నగరంలో పెజావరమఠం, ఉత్తరాదిమఠంలలో ముద్రధారణ ప్రక్రియ జరిగింది. విద్యాపీఠ సర్కిల్‌లోని పెజావరమఠంలో మఠాధిపతి విశ్వప్రసన్నతీర్థ స్వామిజీ పలువురు భక్తులకు ముద్రధారణ చేశారు. అలాగే బసవనగుడిలోని రాయరాయ కల్యాణమండపంలో ఉత్తరాదిమఠం ఆధ్వర్యంలో పెద్దఎత్తున భక్తులకు శంఖు చక్రాల ముద్రధారణ చేశారు. కాగా ఉడుపి అదమారు మఠం ఈశప్రియతీర్థ స్వామిజీ నేతృత్వంలో సదాశివనగర్‌లోని ఈశావ్యాసంలో ముద్రధారణ ప్రక్రియ నిర్వహించారు.



పెజావరమఠంలో...



ఉత్తరాదిమఠంలో...

రైతుల సమస్యలు ఆలకించిన ఎమ్మెల్యే



రైతుల నుంచి వివరాలు అడుగుతున్న ఎమ్మెల్యే శివణ్ణ

» బగర్‌హుకుం అర్జీల పరిష్కారానికి చొరవ

దొమ్మసంద్ర, జూలై 6(ఆంధ్రజ్యోతి): ఆనేకల్ పట్టణంలోని తాలూకా కార్యాలయంలో బగర్‌హుకుం సాగు కింద అర్జీలు సమర్పించిన రైతుల సమస్యలను ఎమ్మెల్యే బీ శివణ్ణ ఆలకించారు. బగర్‌హుకుం సాగువళి సక్రమం కింద అర్హులైన రైతుల రికార్డుల పరిశీలనకు ఇప్పటికే పలు సమావేశాలు నిర్వహించారు. నమూనా 50, 53 కింద అర్జీ సమర్పించిన వాటిని సక్రమీకరణ సమితి ముందు తగిన రికార్డులు సమర్పించాలని సూచించామన్నారు. ఆనేకల్ తాలూకాలో ఇప్పటికే 7వేల అర్జీలు వచ్చాయ న్నారు. కోర్టు ఆదేశాల మేరకు 19మంది రైతులకు సాగుగుర్తింపు చీటీలు ఇచ్చేందుకు సంబంధించి సక్రమీకరణ సమితి నుంచి సమాచారం పొందినట్టు తెలిపారు. త్వరలోనే అర్హులైన లబ్ధిదారులకు సాగు చీటీలు ఇస్తామన్నారు. నెలకో సమావేశం నిర్వహించడం ద్వారా రైతుల అభిప్రాయాలను ఆలకించి సమితి తగిన చర్యలు తీసుకుంటుందన్నారు. సమావేశంలో తహసీల్దార్ శశిధర్ మాడ్యాళ్, ఏడీఎల్ఆర్ మదన్, బగర్‌హుకుం సక్రమీకరణ సమితి సభ్యుడు బళ్ళూరు నారాయణస్వామి, కూగూరు బసవరాజు, సుధా తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్‌కు ఘననివాళి



తాలూకా కార్యాలయంలో నివాళులు అర్పిస్తున్న తహసీల్దార్ తదితరులు

ముళబాగిలు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): హరిత విప్లవకారుడు డాక్టర్ బాబు జగ్జీవన్‌రాంకు ఘన నివాళులు అర్పించారు. పట్టణంలోని మినీ విధానసౌధలో జగ్జీవన్‌రాం వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. జగ్జీవన్‌రాం చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. తహసీల్దార్ వీ గీతా మాట్లాడుతూ స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొనడమే కాక స్వాతంత్ర్యం అనంతరం కూడా సామాజిక న్యాయం, సమానత అభివృద్ధికి ఆయన సేవలు అపారమన్నారు. సమాజంలో వెనుకబడిన, దళిత వర్గాల సమస్యల ధ్వనిగా నిలిచారన్నారు. దేశ ఉపప్రధానిగా ఆయన ఆదర్శంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో ఉపతహసీల్దార్‌లు కొండప్ప, సుబ్రమణి, దేవదాయశాఖ అధికారి సుబ్రమణి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ఆరోపణలతో
డీసీసీ బ్యాంకుకు నష్టం



మాట్లాడుతున్న డాల్ఫిన్ నాగరాజ్ తదితరులు

శిడ్లఘట్ట, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌పార్టీ నాయకులు కొంతమంది సొంతపార్టీపైన ఆరోపణలు గుప్పించడం ద్వారా కోలారు, చిక్కమగళూరు జిల్లా రైతులు, మహిళలకు అండగా ఉన్న డీసీసీ బ్యాంకు దివాళాదశకు చేరుకుంటోందని డీసీసీ బ్యాంకు డైరెక్టర్ డాల్ఫిన్ నాగరాజ్ ఆరోపించారు. పట్టణంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం, ఇన్‌చార్జ్ మంత్రులు బ్యాంకు అభివృద్ధిని నిర్లక్ష్యం చేశారన్నారు. కోలారు ఇన్‌చార్జ్ మంత్రి బైరతి సురేశ్, చిక్కబళ్ళాపుర ఇన్‌చార్జ్ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్‌లు జిల్లా అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. ఇకనైనా రైతులు, సామాన్యుల సంక్షేమం పట్ల దృష్టి సారించాలన్నారు. ఈ సందర్భంగా బ్లాక్‌కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు శ్రీనాథ్, తాలూకా కురుబ సంఘం అధ్యక్షుడు మంజునాథ్, కార్యదర్శి రామాంజి, మహ్మద్ అర్ఫియా తదితరులు పాల్గొన్నారు.

నొప్పి నివారణ కేంద్రాలకు డిమాండ్

బెంగళూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఇటీవల నొప్పి నివారణ కేంద్రాలకు డిమాండ్ పెరుగుతోందని అందుకు అనుగుణంగానే దేశంలో పేరొందిన ఇపియోన్ సంస్థ సహకారనగర్‌లో కొత్తశాఖను ప్రారంభించినట్టు ఎండీ డాక్టర్ సుధీర్ తెలిపారు. ఆదివారం శాఖను ప్రారంభించిన తర్వాత ఆయన మాట్లాడుతూ దక్షిణభారత్‌లో 20ఏళ్ల అనుభవంతో 75వేలమంది రోగులకు చికిత్సలు అందించడం ద్వారా విశ్వాసం పొందామన్నారు. వివిధ ఆరోగ్య సమస్యలతో దీర్ఘకాల నొప్పులను నియంత్రించేందుకు ప్రత్యేక విధానాలను పాటిస్తున్నామన్నారు. బెంగళూరులో వైద్య సేవలు విస్తరించడం సంతోషంగా ఉందన్నారు. సహకారనగర్‌శాఖ ముఖ్యులు డాక్టర్ శ్రీహర్ష తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం



అగ్నిగుండ ప్రవేశం

చింతామణి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): తాలూకా వ్యాప్తంగా ముస్లింలు మొహరం పండుగను ఘనంగా ఆచరించారు. పట్టణంతోపాటు పలుచోట్ల అగ్నిగుండం ఏర్పాటు చేసి వాటిపై నడిచారు. ఈ సందర్భంగా పురవీధులలో పీర్లను ఊరేగించారు. యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. డప్పుల వాద్యాలకు అనుగుణంగా పిల్లలు పెద్దలు స్టెప్పులు వేశారు. ఆదివారం ఎటుచూసినా మొహర్రం సందడి నెలకొంది.

కరడకల్‌లో వరస చోరీలు

రాయచూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని లింగసుగూరు పురసభ పరిధిలోని కరడకల్ గ్రామ పరిసరాల్లో శనివారం రాత్రి నాల్గు ఇళ్లల్లో దొంగతనం జరిగింది. మొహ్రం పండుగ సందర్భంగా అందరూ ఆశిర్ఖానా(దర్గా) వద్దకు వెళ్లిన సందర్భాన్ని అదనుగా తీసుకున్న దుండగులు వరుసగా ఐదు ఇళ్లల్లో చోరీకి పాల్పడ్డారు. ఈ సందర్భంగా రుద్రయ్య స్వామి అనే వ్యక్తి ఇంట్లో ఐదు తులాల బంగారం 60 వేల నగదుతో పాటు 15 తులాల వెండి వస్తువులను ఎత్తుకెళ్లారు. దీంతోపాటు మరో మూడు గుండయ్యస్వామి, పవాడెప్ప నాయక్, మహంతేశ కుంబార ఇళ్లల్లోను దొంగతనం జరిగినట్లు పోలీసులు గుర్తించారు. తాళం వేసిన ఇళ్లను టార్కెట్‌గా చేసుకున్న దొంగలు దాదాపు 2 గంటల పాటు ఎదేచ్ఛగా తమ పని కానిచుకున్నట్లు పోలీసులు గుర్తించారు.